సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 46 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం | 30.05.2025




2 లో

## ధాన్యం సేకరణలో మనమే
# నంబర్ వన్

- నకిలీ విత్తనాలు, ఎరువుల అరికట్టాలి
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి


ధాన్యం సేకరణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖతో కలిసి హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వరంగల్ ఉమ్మడి జిల్లాలో ధాన్యం సేకరణ, వ్యవసాయం, వర్షా కాల ముందస్తు ప్రణాళిక, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు.

*- మన చౌరాస్తా, వరంగల్ ప్రతినిధి*

# గద్దర్ అవార్డుల ప్రకటన

- ఉత్తమ చిత్రంగా కల్కి మూవీ
- ఉత్తమ నటిగా నివేదా థామస్
- ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్
- ఉత్తమ గాయనిగా శ్రేయా ఘోషాల్

4 లో



# వైభవంగా ఆరుద్రోత్సవం

**పాలకుర్తి, మన చౌరాస్తా :** సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని గురువారం రాత్రి 'ఆరుద్రోత్సవం' కార్యక్రమం మేళతాళాలు, అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య మహా వైభవోపేతంగా నిర్వహించారు. పంచ హారతులు, కుంభహారతి, నక్షత్ర హారతి, నాగ హారతి ఈ విధంగా విశేష హారతులతో గర్భాలయంలో దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సల్వాది మోహన్ బాబు, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డివిఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



# రైతులు అప్రమత్తంగా ఉండాలి



## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ, మన చౌరాస్తా : ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే వరకు కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని రఘునాథపల్లి మండల కేంద్ర పరిధిలో, అలాగే కంచనపల్లి గ్రామ పంచాయతీలో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు. ఈ నేపథ్యంలో ధాన్యం సంచుల్లో నింపే విధానం, వడ్ల బస్తాల తరలింపు ప్రక్రియను తనిఖీ చేశారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ధాన్యం సేకరణ జరగాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, సత్వరమే పూర్తిచేయాలన్నారు. ధాన్యం రవాణాకు సరిపడా వాహనాలను అందుబాటులో పెట్టుకొని వడ్ల సంచుల ఎగుమతులు, దిగుమతులు వెంటనే జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోళ్ల విషయంలో రైతులు అపోహలకు గురికావొద్దని, తడిసిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మోసిన్, సంబంధిత అధికారులు ఉన్నారు.



# ధాన్యం సేకరణలో మనమే నంబర్ వన్

- నకిలీ విత్తనాలు, ఎరువుల అరికట్టాలి
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**వరంగల్, మన చౌరాస్తా :** ధాన్యం సేకరణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖతో కలిసి హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వరంగల్ ఉమ్మడి జిల్లాలో ధాన్యం సేకరణ, వ్యవసాయం, వర్షాకాల ముందస్తు ప్రణాళిక, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, ఎస్పీలను మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా విక్రయించకుండా నకిలీ ఎరువులు, విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు ఎరువులు అమ్మినట్లయితే పీడీ యాక్ట్ ను నమోదు చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా ధాన్యం సేకరణలో (ఖరీఫ్, రబీ రెండు సీజన్లో) తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానం లో ఉందన్నారు. ధాన్యం అంశానికి సంబంధించిన తలెత్తుతున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరగాలన్నారు. నిర్ణీత గడువుని నిర్ణయించి దాని ప్రకారం ఇల్లు నిర్మాణం పూర్తి కావాలన్నారు. జూన్ 6వ తేదీ నాటికి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్లు ఇందిరమ్మ ఇండ్లకు ఇసుకను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందజేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపిక చేసిన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను సంబంధిత ఎమ్మెల్యేలకు కలెక్టర్లు అందజేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి లబ్ధిదారులకు ఏజ్ లిమిట్ లేదని పేర్కొన్నారు. అత్యంత నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ సంవత్సరంలో ఇల్లు నిర్మించుకోలేని లబ్ధిదారులు ఎవరైన ఉన్నట్లయితే వచ్చే ఏడాది వారు కట్టుకునే విధంగా కలెక్టర్లు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి సోమవారం సాయంత్రం నాటికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులను లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాకు సంబంధించి తాను సంతకం చేసిన ఫైళ్లను వెంటనే ఆయా జిల్లాల కలెక్టర్లు మంజూరు పత్రాలను సంబంధిత ఎమ్మెల్యేలను అందజేయాలన్నారు. సాదా బైనామా విషయం కోర్టు లో ఉందని, కోర్టు సెలవులు పూర్తికాగానే ఈ విషయమై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. గ్రామ పాలన ఆఫీసర్స్ టెస్ట్ పూర్తయిందని, పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి జూన్ 2వ తేదీన గ్రామ పాలన అధికారులను నియమించబోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడుకోవాలన్నారు. రైతులు, భూములు ఉన్న వారిని ఇబ్బందులు పెట్టొద్దన్నారు. రైతులను ఇబ్బందులను పెడితే చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి ప్రజలే ముఖ్యమని పేర్కొన్నారు. జూన్ 3వ తేదీ నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించాలని, స్వీకరించిన దరఖాస్తులను ఆగస్టు 15వ తేదీ నాటికి పరిష్కరించాలన్నారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఉదయం జిల్లా కేంద్రంలో కార్యక్రమం నిర్వహించాలని, అదే రోజు మధ్యాహ్నం నియోజకవర్గ కేంద్రాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తెలియజేయాలన్నారు.

రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు ఎరువులు నియంత్రణకు ఏర్పాటుచేసిన కమిటీలో అధికారులతో పాటు రైతులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. బ్లాక్ మార్కెట్ కు విత్తనాలు ఎరువులు తరలకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ కమిటీ క్రియాశీలకంగా పనిచేస్తూ నిరంతరం నిఘా ఉంచాలన్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల ద్వారా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మెలకువలపై అవగాహన కల్పించాలన్నారు. అటవీ, రెవెన్యూ, ఎండోమెంట్ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు సజావుగా జరిగిందని పేర్కొన్నారు. మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి లబ్ధిదారుల పేర్ల జాబితాను కలెక్టర్ కు అందజేసినట్లు పేర్కొన్నారు. తన నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలలో దశాబ్దాలుగా నివాసాలు ఉంటున్న పేదలకు పొజిషన్ సర్టిఫికెట్లు లేవని, వారికి అర్హతలను పరిశీలించి పొజిషన్ సర్టిఫికెట్లు అందజేయాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా కలెక్టర్ పరిశీలించి పొజిషన్ సర్టిఫికెట్లను అందజేయాలని మంత్రి సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ.. 2024-25 రబీ పంట కాలములో ఐ.కే.పి, పి.ఎ.సి.ఎస్ ఆధ్వర్యంలో మొత్తం 300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గతం లో కంటే అత్యధికంగా ఎలాంటి సమస్యలు లేకుండా కొనుగోలు చేశామని... ఇప్పటి వరకు లక్ష 60 వేల 616 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కనీస మద్దతు ధరకి కొనుగోలు చేసి రూ.372 కోట్లను రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతా లోకి ఆన్ లైన్ ద్వారా జమ చేశామన్నారు అదే విధంగా 5 వేల 561 మంది రైతుల నుంచి 22, 550 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి బోనస్ రూపంలో రైతులకు రూ.11.27 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసామన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వడ్ల బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలి

## అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** జిల్లాలోని రఘునాథపల్లి మండలంలోని వెల్ది, అశ్వరావుపల్లి, జాఫర్ గూడెం, ఖిలాషాపూర్ గ్రామాల్లో, అలాగే నర్మేట మండలంలోని వెల్దండ గ్రామాల పరిధిలో పీఏసీఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తేమ శాతం, కొనుగోళ్ల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. వర్షాల దృష్ట్యా ధాన్యం తడవకుండా టార్పాలిన్లను సరైన విధంగా కప్పాలని, తేమ శాతం రాగానే ధాన్యం కాంటా పూర్తిచేసి బస్తాలను వెంటవెంటనే లారీలకు ఎక్కించి, రైస్ మిల్లులకు త్వరగా తరలించాలని, ఎటువంటి నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు. అలాగే కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేసి, ఓపీఎంఎస్ లో ఎప్పటికప్పుడు వివరాలను సక్రమంగా నమోదు చేయాలని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. అదే విధంగా కేంద్రంలోని రైతులతో మాట్లాడారు. తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, ఎటువంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. అదనపు కలెక్టర్ వెంట డీఎం సీఎస్ హతీరాం, డీసీఎస్ఓ సరస్వతి, ఏసీఎస్ఓ ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, తహసీల్దార్లు మోసిన్, రామానుజచారి ఉన్నారు.



# పెద్దమ్మ తల్లి గుడిలో పూజలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణ కేంద్రంలోని 15వ వార్డులో గురువారం ముదిరాజ్ పెద్దమ్మ తల్లి 12వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పెద్దమ్మ తల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ జనగామ ప్రజలను పెద్దమ్మ తల్లి సల్లగా చూసి అందరికి ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని కోరుకుంటున్నానని చెప్పారు.



# మోడీకి గుణపాఠం తప్పదు

**జనగామ, మన చౌరాస్తా :** మోడీ ప్రభుత్వాన్ని రాబోవు కాలంలో దేశ రైతాంగం ఇంటికి సాగనంపడం ఖాయమని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ అన్నారు. గురువారం తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం హరిత విప్లవ పితమహుడు ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ఆధారంగా ధరలు నిర్ణయించకుండా, మనుధర్మ శాస్త్రం అమలు చేసి రైతుల నడ్డివిరిచే సిగ్గుమాలిన పని చేస్తున్నారని మండిపడ్డారు. మోడీ దేశ రైతాంగానికి ఇచ్చిన రాత పూర్వక హామీలు, రైతుల ఆదాయం రెట్టింపు జుటా మాటలేనా ?, తూతూ మంత్రంగా రైతులు పండించిన పంటల ధరలు పెంపు అంటే దేశ వ్యాప్తంగా రైతాంగాన్ని అమెరికా, అదాని, అంబానీ లాంటి బడాపెట్టుబడి దారులకు కట్టబెట్టే ప్రయత్నం విరమించుకోవాలన్నారు. అదేవిధంగా ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల ధరలు తగ్గించాలని, దేశ రాష్ట్ర రైతాంగం అత్యధికంగా సాగు చేసే పంటలు వరి, పత్తి, మొక్కజొన్న, జొన్నల ధరలు పెంచకుండా కేవలం నాలుగు శాతమే మద్దతు ధరలు పెంచడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై జూన్ 11న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల సారయ్య, నాయకులు ఉప్పలయ్య పాల్గొన్నారు.





## టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

# కట్టుదిట్టంగా నిర్వహించాలి

**జనగామ, మన చౌరాస్తా :**

జిల్లాలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఏసీపీ పండరి చేతన్ నితిన్ లతో కలిసి జిల్లా కలెక్టర్ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 3 నుంచి 13 వరకు జరిగే పది సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా కేంద్రంలోని ధర్మకంచలో గల జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలను ఏర్పాటు చేయగా, మొత్తం 74 మంది విద్యార్థులు ఈ పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాయనున్నారన్నారు. ఉదయం 9:30 నుంచి 12:30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు తాగునీరు, బెంచీలు, బల్లలు, కుర్చీలు, మూత్రశాలల సౌకర్యం వంటి అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చాలన్నారు. పోలీస్ ఎస్కార్ట్ తో ప్రభుత్వ వాహనంలో నిర్దేశించిన రూట్ లో మాత్రమే పరీక్ష పేపర్లను పరీక్ష కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి విద్యార్థిని నిశితంగా పరిశీలించిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్ కు అవకాశం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఎవరికీ కూడా మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు అనుమతి లేదన్నారు. ఎక్కడా కూడా తప్పులు దొర్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఈఓ భోజన్న, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జీసీడీఓ గౌసియా బేగం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఏసీపీ పండరి చేతన్ నితిన్ లతో కలిసి తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 2న జరుపుకొనే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు సంయుక్తంగా పనిచేయాల్సిందిగా సూచించారు. సమావేశంలో జనగామ ఆర్డీఓ గోపీరాం, కలెక్టరేట్ ఏవో మన్సూర్, జిల్లా విద్యా శాఖ అధికారి భోజన్న, జిల్లా పౌరసరఫరాల అధికారిణి సరస్వతి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ వసంత, డీపీఓ స్వరూప, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీధర్ రావు, డీవైఎస్ఓ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## భవిత కేంద్రాన్ని పరిశీలించిన డీఈవో

జనగామ, మన చౌరాస్తా : జనగామలో ఉన్న ప్రత్యేక అవసరాలు పిల్లల కోసం నిర్మించిన భవిత కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న గురువారం పరిశీలించారు. భవిత కేంద్రంలో జరుగుచున్న సివిల్ వర్క్స్ ను పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. పాఠశాలలు ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేక అవసరాల పిల్లల పట్ల మానవతా దృక్పథంతో ఉండాలనిర, వారికి అన్ని సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వాటిని వినియోగించుకుని ప్రత్యేక బోధన చేయాలని సూచించారు. అదేవిధంగా పక్కనే ఉన్న జిల్లా పరిషత్ బాలికల పాఠశాల భవనాన్ని పరిశీలించి మధ్యలో ఆగిపోయిన భవన నిర్మాణ పనులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిర్మాణం పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గురిజాల శంకర్ రెడ్డి, శోభారాణి పుష్ప, సీఆర్పీ యాదయ్య, కాంట్రాక్టర్ నరసింహులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా పరామర్శ

చేర్యాల, మన చౌరాస్తా : చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త, మాజీ వార్డ్ మెంబెర్ బొడ్డు వీరేష్ గురువారం గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి అక్కడికి చేరుకొని ఆయన పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

# రామాయణం యాక్షన్ సీన్స్

- **హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ గై నోరిస్ ఎంటర్**




భారతీయ సినీ ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఇతిహాసిక చిత్రం 'రామాయణం' . ప్రముఖ నటుడు, నిర్మాత రాకింగ్ స్టార్ యశ్ ఈ భారీ ప్రాజెక్టులో రావణుని పాత్రలో కనిపించబోతుండగా, రాముడిగా రణబీర్ సింగ్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. ఈ సినిమా కోసం హాలీవుడ్‌కు చెందిన ప్రఖ్యాత స్టంట్ డైరెక్టర్ గై నోరిస్ యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తున్నారు. గై నోరిస్ గతంలో 'మాడ్ మ్యాక్స్: ఫ్యూరీ రోడ్', 'ది సుసైడ్ స్క్వాడ్' వంటి హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ చిత్రాలకు స్టంట్ కొరియోగ్రఫీ చేశారు. ఇప్పుడు ఆయన 'రామాయణం' కోసం ప్రత్యేకంగా భారతదేశానికి వచ్చి యాక్షన్ సన్నివేశాల రూపకల్పనలో నిమగ్నమయ్యారు. ఈ చిత్రం, భారతీయ పౌరాణిక గాథను ప్రపంచస్థాయిలో ఆవిష్కరించేందుకు రూపుదిద్దుకుంటోంది. యశ్ ఈ సినిమాలో నటుడిగా మాత్రమే కాకుండా సహనిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. చిత్రీకరణ మొదలైనప్పటి నుంచే యశ్ సృజనాత్మకంగా పూర్తిగా చొరవ చూపుతూ, ప్రతి అంశంలో భాగస్వామిగా మారారు. తాజాగా మేకర్స్ యాక్షన్ సన్నివేశాలకు సంబంధించిన చిత్రీకరణ ఫోటోలను విడుదల చేశారు. ఈ చిత్రాన్ని నితేష్ తివారీ డైరెక్ట్ చేస్తుండగా, నమిత్ మల్హోత్రాతో కలిసి యశ్ నిర్మిస్తున్నాడు. ఈ సినిమా మొదటి భాగం వచ్చే యేడాది దీపావళికి విడుదల కానుంది. రెండో భాగాన్ని 2027 దీపావళికి విడుదల చేస్తారు.

4 మన చౌరాస్తా

Mana Chourasta 30.05.2025 శుక్రవారం

## మహేశ్ ఖలేజా రీ రిలీజ్

మహేశ్ బాబు కెరీర్‌లో భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టిన సినిమాల్లో ఖలేజా ఒకటి. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 30న రీ రిలీజ్ కానుంది. సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా దీనిని రీ రిలీజ్ చేస్తున్నారు. సినిమా విడుదలైన చాలా ఏండ్లు అయినప్పటికీ ఈ చిత్రానికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. రీ రిలీజ్‌పై ప్రీ సేల్స్ అంశంలో సరికొత్త బెంచ్‌మార్క్ నమోదు చేసి అభిమానుల్లో మరింత క్యూరియాసిటీని పెంచేస్తుంది. ఖలేజా రీ రిలీజ్ చేస్తున్న నేపథ్యంలో ఇటీవల మూవీ నిర్మాతల్లో ఒకరైన సీ కల్యాణ్ చేసిన కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. 2010లో సినిమా ఒరిజినల్ రిలీజ్ గురించి ఆయన మాట్లాడుతూ.. బాక్సాఫీస్ వద్ద మహేశ్ బాబు అభిమానులే స్వయంగా సినిమాను చంపేశారంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు. మహేశ్ బాబు అభిమానులు ప్రత్యేక అంచనాలతో థియేటర్లకు వచ్చారు. అయితే సినిమా చూసిన తర్వాత అంచనాలు అందుకోలేకపోవడంతో నిరాశే మిగిలిందంటూ చెప్పుకొచ్చారు. ఆ సమయంలో చాలా మంది అభిమానులు వ్యక్తిగతంగా విమర్శించారు. కానీ ఇప్పుడు మాత్రం ఆ అభిమానులే బిగ్ స్క్రీన్‌పై మరోసారి సినిమా చూసేందుకు ఎదురుచూస్తున్నారు. బహుశా ఖలేజా బాకీ బడ్డది కేవలం 15 ఏండ్ల తర్వాతే తిరిగి చెల్లించాలని రాసి పెట్టుందేమోనన్నారు సీ కల్యాణ్. గతంలో మిస్సయిన గుర్తింపు రీ రిలీజ్ అయిన తర్వాత అయినా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో అనుష్కా శెట్టి, ప్రకాశ్ రాజ్, బ్రహ్మానందం, అలీ, సునిల్ ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# గద్దర్ అవార్డుల ప్రకటన

- **ఉత్తమ చిత్రంగా కల్కి మూవీ**
- **ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్**
- **ఉత్తమ నటిగా నివేదా థామస్**
- **ఉత్తమ గాయనిగా శ్రేయా ఘోషాల్**

**హైదరాబాద్, మన చౌరాస్తా :** గద్దర్ అవార్డుల విభాగంలో ఉత్తమ చిత్రంగా కల్కి, ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ నటిగా నివేదా థామస్, ఉత్తమగాయనిగా శ్రేయా ఘోషల్ ఎంపికలయ్యారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించింది. ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుతో కలిసి జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ మీడియా సమావేశంలో 2024కు సంబంధించిన అవార్డులను ప్రకటించారు. మొత్తం 1248 నామినేషన్లను పరిశీలించిన కమిటీ.. విజేతలను ఎంపిక చేసింది. తెలంగాణ యుద్ధ నౌక, దివంగత ఉద్యమ నేత గద్దర్ పేరు మీద.. సినీ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఈ అవార్డులు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. గతంలో ఉన్న నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలిసారి గద్దర్ అవార్డులు అందజేయనున్నారు. ఉత్తమ నటుడిగా అల్లుఅర్జున్, ఉత్తమ చిత్రంగా కల్కి సినిమాను కమిటీ ఎంపిక చేసింది. ప్రముఖ నటి జయసుధ నేతృత్వంలో సినీ అవార్డుల జూరి ఏర్పాటు అయ్యింది. ఈ క్రమంలో గురువారం ఉదయం గద్దర్ తెలంగాణ సినిమా అవార్డుల వివరాలను అవార్డుల కమిటీ చైర్మన్ జయసుధ ప్రకటించారు. దాదాపు 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం అవార్డులను ఇవ్వబోతోందని ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు అన్నారు. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు లేకుండా పారదర్శకంగా అవార్డులను ఎంపిక చేశామని జయసుధ చెప్పారు. అవార్డులు తమకు బూస్ట్ ఇస్తాయని.. ప్రభుత్వం తమకు ఫుల్ ఫ్రీడమ్ ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , భట్టి విక్రమార్క , కోమటిరెడ్డి , దిల్ రాజుకు ధన్యవాదాలు తెలియజేశారు. 14 ఏళ్ల అనంతరం అవార్డులు ఇవ్వటం సంతోషమన్నారు. బెస్ట్ ఆఫ్ బెస్ట్ కే అవార్డులు వస్తున్నాయని అన్నారు. జూన్ 14న హైటెక్స్‌లో అవార్డుల ప్రదానం జరుగుతుందన్నారు. అలాగే 201423 సంవత్సరాలకు సంబంధించిన అవార్డులను త్వరలో ప్రకటిస్తామన్న జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ వెల్లడిరచారు. గద్దర్ అవార్డులు దక్కిన వివరాలు ఇలా ఉన్నాయి.

- ఉత్తమ చిత్రం కల్కి
- ఉత్తమ రెండో చిత్రం పొట్టేల్
- ఉత్తమ మూడో చిత్రం లక్కీభాస్కర్
- ఉత్తమ నటుడు అల్లు అర్జున్ (పుష్ప2)
- ఉత్తమ నటి నివేదా థామస్ (35 చిన్న కథకాదు)
- ఉత్తమ డైరెక్టర్ నాగ్ అశ్విన్ (కల్కి)
- ఉత్తమ సహాయ నటుడు ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
- ఉత్తమ సహాయ నటి శరణ్యా ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండ్)
- ఉత్తమ హాస్యనటుడు సత్య, వెన్నెల కిషోర్ (మత్తు వదలరా)
- ఉత్తమ సంగీత దర్శకుడు బీమ్స్ (రజాకార్)
- ఉత్తమ స్టోరీ రైటర్ శివ పాలడుగు
- ఉత్తమ స్క్రీన్ ప్లే వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
- ఉత్తమ గాయకుడు సిద్ద్ శ్రీరామ్ (ఊరుపేరు భైరవకో)
- ఉత్తమ గాయని శ్రేయా ఘోషల్ (పుష్ప2)
- ఉత్తమ కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య (దేవ)
- స్పెషల్ జ్యూరీ అవార్డు దుల్కర్ సల్మాన్ (లక్కీభాస్కర్)
- స్పెషల్ జ్యూరీ అవార్డు అనన్య నాగళ్ల (పొట్టేల్)
- బెస్ట్ డెబ్యూ ఫిల్మ్ డైరెక్టర్ యధువంశీ (కమిటీ కుర్రాళ్లు)
- 2024 ఉత్తమ బాలల చిత్రం 35 చిన్న కథకాదు
- బెస్ట్ ఎన్విరాన్‌మెంట్ హెరిటేజ్‌హిస్టరీ విభాగం రజాకార్
- నేషనల్ ఇంటెగ్రిటీ సోషల్ అప్‌లిఫ్ట్ విభాగం కమిటీ కుర్రాళ్లు

